క్లుప్తంగా

పేదలతో గౌరవంగా మెలగాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు

విజయనగరం ఫోర్ట్: పేదల పట్ల ప్రతిఒక్కరూ గౌరవంగా మెలగాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు తెలిపారు. ఆదివారం స్థానిక అలకానంద కాలనీలో చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ గ్రూప్, తమన్నా ఫౌండేషన్ సంయుక్తంగా పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులు, పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం బాలాజీ, రాజు, విజయ్‌కుమార్, రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

'ద్వారకామయి'కి మేమున్నాం చేయూత..



ద్వారకామయి పాఠశాల వ్యవస్థాపకురాలు ఆశాజ్యోతికి జనరేటర్‌తో పాటు చెక్ అందజేస్తున్న మేమున్నాం సంస్థ సభ్యులు

విజయనగరం టౌన్: మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘ సభ్యులు స్థానిక పూల్‌బాగ్‌లో ఉన్న ద్వారకమయి అంధుల పాఠశాలకు జనరేటర్‌తో భోజన ప్లేట్లను ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాత పద్మావతి మాట్లాడుతూ, నిస్వార్థంగా సేవలందిస్తున్న ద్వారకమయి వంటి సంస్థలకు చేయూతనందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు జనరేటర్, భోజన ఏర్పాట్లకు సంబంధించి రూ. 25వేల చెక్‌ను పాఠశాల వ్యవస్థాపకురాలు మాచేపల్లి ఆశాజ్యోతికి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు కంది మూర్తి, సభ్యులు డోకి చంద్రశేఖర్, కె.రాజశేఖర్, కేవీ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ఎంఈఓ-2గా లక్ష్మి

శృంగవరపుకోట: మండల రెండో విద్యాశాఖాధికారి(ఎంఈఓ)గా పాదం గణపతి లక్ష్మి నియామకమయ్యారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఎంఈఓ-2గా ఈమె నియమితులయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్ బుక్‌లు,పెన్నులు అందజేస్తున్న అమ్మ సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామానికి చెందిన 120 మంది విద్యార్థులకు అమ్మ సేవా ఫౌండేషన్ విద్యాసామగ్రి సమకూర్చింది. అమ్మ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు దేవరపు సురేష్ విద్యార్థులకు నోట్ బుక్‌లు పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. 25 మంది పేద విద్యార్థులకు రెండు జతల చొప్పున దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవగ్రహ శాంతి హోమం



హోమం చేస్తున్న పండితులు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని దారగంగమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి వారి సన్నిధిలో దేవాలయ అర్చకులు రాజగోపాలాచార్యుల నేతృత్వంలో వేదపండితులు ఆదివారం నవగ్రహ శాంతి హోమం జరిపించారు. నరఘోష, దిష్టి దోష నివారణ కోసం హోమం చేశామని అర్చకులు తెలిపారు. పుణ్యగిరి ట్రస్టుబోర్డు చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ, భక్తులు తరలివచ్చారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్ ఖరారు

శృంగవరపుకోట: ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు, పథకాల లబ్ధి పొందేందుకు అవసరమైన తొమ్మిది రకాల ధ్రువపత్రాలు అందించేందుకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం టూర్ షెడ్యూల్‌ను మండల అధికారులు ఆదివారం ఖరారు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కె.భరత్‌కుమార్, ఎంపీడీఓ కె.శేషుబాబు నేతృత్వంలో ఒక బృందం, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మి నేతృత్వంలో ఒక బృందం గ్రామాల్లో పర్యటిస్తుందని అధికారులు తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. జూలై 1వ తేదీన కొట్టాం, గోపాలపల్లి, 4న వెంకటరమణపేట, వీరనారాయణం, 6న కొత్తూరు, తిమిడి, 11న సంతగవిరమ్మపేట, పోతనాపల్లి, 13న ఎస్.కోట తలారి, ఆలుగుబిల్లి, 15న ముషిడిపల్లి, పెదఖండేపల్లి, 18న మామిడిపల్లి, ధర్మవరం, 20న మూలబొడ్డవర, ధారపర్తి, 22న భర్తాపురం ఎస్టీకాలనీ, ఎస్.కోట సచివాలయం-5, 25న ఎస్.కోట సచివాలయం-1, 3, 27న ఎస్.కోట సచివాలయం-2, 4 లలో గ్రామసభలు నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

కష్టాలన్నీ మాయం..

- ఆర్‌బీకేల ఏర్పాటుతో అన్నదాతల మోములో చిరునవ్వు
- విత్తనం నుంచి ఎరువు దాకా ఉన్న ఊరిలోనే పంపిణీ
- దిగుబడుల కొనుగోళ్లు కూడా ఆర్‌బీకేల్లోనే..

విజయనగరం ఫోర్ట్:

వ్యవసాయ రంగ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తోంది. 2019కు ముందు వ్యవసాయం చేయడానికి రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. అంతేకాకుండా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇటువంటి పరిస్థితుల్లో 2019లో అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి అండగా నిలబడ్డారు. సాగు పెట్టుబడి కోసం రైతులకు ఏటా వైఎస్సార్ రైతుభరోసా పేరిట రూ. 13, 500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు అందించడమే కాకుండా సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. పండిన పంటను కూడా కొనుగోలు చేసి కేవలం 21 రోజుల్లోనే రైతు బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు పాడైతే వ్యవసాయ సిబ్బంది స్వయంగా పంటలను పరిశీలించి నష్ట పరిహారం జమ చేస్తున్నారు. ఇందుకోసం ముందుగానే ఆర్‌బీకేల్లో రైతులు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారో ఈ క్రాప్‌లో నమోదు చేసుకుంటున్నారు. విజయనగరం మండలంలో 13 ఆర్‌బీకేలు ఏర్పాటు చేశారు.

విత్తనాలపై రూ. 40 లక్షల రాయితీ..

రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం 2019 నుంచి రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈ నాలుగేళ్ల కాలంలో విజయనగరం నియోజకవర్గ రైతులకు సుమారు నాలుగు టన్నుల విత్తనాలు సరఫరా చేయగా.. రాయితీపై ప్రభుత్వం సుమారు 40 లక్షలు భరించింది. అలాగే ఆర్‌బీకే పరిధిలో కస్టమ్ హైరింగ్ సెంటర్ (రైతు సంఘం) ఏర్పాటు చేసి రాయితీపై ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేస్తోంది. విజయనగరం మండలంలో 13 సీహెచ్‌సీల గ్రూపులకు రూ. 82.31 లక్షల విలువైన ట్రాక్టర్లు, ఇతర యంత్ర పనిముట్లను అందించింది. ఇందుకుగాను ప్రభుత్వం రూ. 26 లక్షల రాయితీ చెల్లించింది.

రైతుభరోసా కింద రూ. 24.16 కోట్లు

వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా 4,799 మంది రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. ఇప్పటివరకు రైతులకు రూ. 24. 16 కోట్లు చెల్లించింది. అలాగే పండిన పంటలను దళారీలు లేకుండా నేరుగా ఆర్‌బీకేల్లో విక్రయించే ఏర్పాట్లు చేసింది.

"21 రోజుల్లో డబ్బులు జమ..



నా పేరు పొటుపురెడ్డి ఆదినారాయణ. నాకు రాకోడు గ్రామంలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం పడరాని పాట్లు పడేవారం. అలాగే పండిన పంటను విక్రయించడానికి కూడా ఇబ్బందులు తప్పేవి కావు. దిగుబడి విక్రయించిన తర్వాత బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులుండేవి. కాని 2019 తర్వాత ఆ కష్టాలన్నీ మాయమయ్యాయి. రైతు సమస్యలు తెలుసుకున్న జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో వ్యవసాయం పండగలా మారింది. గ్రామాల్లోనే ఆర్‌బీకేలు ఏర్పాటు చేయడంతో విత్తనాల దగ్గర నుంచి ఎరువులు గ్రామంలోనే దొరుకుతున్నాయి. అలాగే ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో బిల్లులు కూడా వేస్తున్నారు. గతంలో వ్యాపారులకు ధాన్యం విక్రయించేవారం. ప్రస్తుతం ఆర్‌బీకేల్లోనే విక్రయించడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తోంది. అన్నదాతలను అన్నివిధాలుగా ఆదుకుంటున్న జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.



పినవేమలిలో రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది (ఫైల్)



రాకోడు రైతు భరోసా కేంద్రం

"నిజమైన రైతుకు న్యాయం..



వ్యవసాయరంగంలో తీసుకువచ్చిన మార్పుల వల్ల నిజమైన రైతులకు న్యాయం జరుగుతోంది.. ప్రతి ఏటా నిర్దేశించిన సమయానికి రైతుభరోసా డబ్బులు నా బ్యాంక్ ఖాతాలో జమవుతున్నాయి.. ఆర్‌బీకేలో ఈ క్రాప్ నమోదు చేయడం వల్ల ప్రభుత్వ ప్రోత్సాహాలన్నీ అందుతుండడంతో పాటు ప్రభుత్వపరంగా గుర్తింపు లభించింది. రాయితీపై ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో దొరుకుతున్నాయి. గతంలో అప్పులు చేసి సాగు చేయగా.. ప్రస్తుతం ఎటువంటి అప్పులకు పోకుండానే దర్జాగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అన్నీ సమకూరుస్తోంది.. నిజంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మనసున్న మారాజే..

– మాసాడా ప్రసాద్, రైతు, పినవేమలి



విత్తనాల కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

ఏసే లోకానికి తండ్రి..



పాస్టర్ అలజంగి రవికుమార్‌ను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

విజయనగరం టౌన్: సకల జనుల పాపాలను మోసి లోకమనే కుటుంబాన్ని నడిపించే ఏసే లోకానికి తండ్రి అని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ తెలిపారు. ఫాదర్స్ డే పురస్కరించుకుని అంబటిసత్రం వద్ద నున్న చర్చి ఆవరణలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు, పెద్దలకు సత్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్చే సంస్కృతిని విడనాడాలన్నారు. అనురాగాన్ని పంచి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో అక్కున చేర్చుకుని వారి బాగోగులను చూసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రవికుమార్‌ను సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అబ్రహం, గంట మహేష్, విక్టర్ బాబు, కోరాడ నాగేశ్వరరావు, చౌదరి, జాన్, యూత్ ఫర్ జీసస్ నిషాంత్, డేవిడ్, వివేక్, మోడి, సిస్టర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ



రజతోత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ గణపతిరావు, తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: గురజాడ స్కూల్ రజతోత్సవాలను ఈ నెల 23, 24, 25వ తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ స్కూల్ కరస్పాండెంట్ ఎమ్. స్వరూప తెలిపారు. రజతోత్సవాలకు సంబంధించిన లోగోను డీఆర్‌ఓ గణపతిరావు చేతుల మీదుగా ఆదివారం స్థానిక గురజాడ స్కూల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాజీ, హెచ్‌ఎం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన విద్యార్థి దువ్వారపు మణికంఠ కనిపించడం లేదని తండ్రి ఎర్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు ఆదివారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మణికంఠ తనకు నచ్చిన కళాశాలలో చేర్పించమని పట్టుబట్టగా, తల్లిదండ్రులు నిరాకరించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల , తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 33వ డివిజన్ మయూరి జంక్షన్ ప్రాంతంలో 32 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన రహదారికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మయూరి జంక్షన్ నుంచి శ్రీనివాస కళాశాల వరకు 32 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా నాగోజీపేటలో పాఠశాలను అభివద్ధి చేశారని, ఎత్తుబ్రిడ్జి జంక్షన్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. 33వ డివిజన్‌లో ఇప్పటివరకు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తిస్తున్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, జోనల్ ఇన్‌చార్జ్ మారం బాల బ్రహ్మారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

బొండపల్లి: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని రోళ్లవాక గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంటి పట్టా పొంది, గృహం మంజూరైన వారంతా కచ్చితంగా నిర్మాణాలు చేయాలని, లేకుంటే పట్టాలు రద్దు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందజేస్తోందని, ఇప్పటికే పనులు ప్రారంభించిన వారు వేగవంతం చేయాలని, ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వారు త్వరగా పనులు మొదలు పెట్టాలని సూచించారు. ఎంపీడీఓ వై.వి. రాజేంద్ర ప్రసాద్, హౌసింగ్ ఏఈఈ బి.వి.రమణ మూర్తిరాజు, ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, నాయకులు రౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.



రోళ్లవాకలో ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

చీపురుపల్లి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షుడు కల్యాణ్ నాయుడు కోరారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పార్కు ఆవరణలో ఆదివారం నిర్వహించిన దివ్యాంగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. అలాగే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, దివ్యాంగులు సమావేశాలు నిర్వహించుకునేందుకు మండల కేంద్రాల్లో ప్రత్యేక భవనాలు నిర్మించాలన్నారు.వికలాంగుల హక్కుల పోరాట సమితి విజయనగరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, చీపురుపల్లి మండల కమిటీ అధ్యక్షుడు పెనుమజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప' నిధులతో సమస్యలకు చెక్

- ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు
- గ్రామాల్లో దీర్ఘకాల సమస్యలకు పరిష్కారం



చీపురుపల్లి: వంగపల్లిపేటలో శ్మశానవాటికకు నిర్మించిన సీసీ రోడ్డు



దత్తిరాజేరు: గడసాంలో చురుగ్గా సీసీ కాలువ నిర్మాణ పనులు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం ప్రకారం అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజలకు పథకాలకు సంబంధించిన, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడమే కాకుండా అయా గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యలకు సైతం పరిష్కారం చూపిస్తోంది. 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గ్రామాల్లో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యల కోసం ప్రతీ గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే చీపురుపల్లి మేజర్ పంచాయతీలోని సచివాలయం-3 పరిధిలో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ సచివాలయం పరిధిలోని వంగపల్లిపేట గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ఆ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించినప్పుడు సమస్యను ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధుల సూచనలతో అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేట్లు సిద్ధం చేశారు. రూ.10 లక్షలతో వంగపల్లిపేట నుంచి శ్మశానవాటికకు సిమెంట్ రోడ్డు నిర్మాణం తాజాగా పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.3.5 లక్షలతో సీసీ కాలువ పనులు

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామంలో ఆంజనేయస్వామి కోవెల నుంచి ఉన్నత పాఠశాల వరకు సీసీ కాలువ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని సర్పంచ్ నేతేటి దీపిక, సచివాలయ కన్వీనర్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. గ్రామంలో పూర్తిగా శిథిలమైన సీసీ కాలువను పునర్నిర్మించాలని 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్యను గ్రామస్తులు కోరారని గుర్తు చేశారు. కాలువ నిర్మాణానికి ఎస్టిమేషన్లు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారని చెప్పారు. దీంతో అధికారులు సచివాలయాలనికి మంజూరైన రూ.20 లక్షల నిధుల నుంచి సుమారు రూ.3.5 లక్షలు కాలువ నిర్మాణానికి కేటాయించారని చెప్పారు. ఈ నిధులతో 180 మీటర్ల సీసీ కాలువను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన పాలనకు మద్దతివ్వండి..

- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: గడిచిన నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కనీవిని ఎరుగని విధంగా మెరుగైన పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. నగరంలోని 48వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో ఆదివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అలాగే నాలుగేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముందుగా స్థానికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. తాము పర్యటిస్తున్న ప్రాంతాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి గెలిపించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ మాట్లాడుతూ, తమ ప్రాంతంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వయంగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మధు, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కనుగుల రాజా పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్

ఇంటింటికీ సంక్షేమం..

విజయనగరం: నగరంలోని 33వ డివిజన్ పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజా స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి అడుగడుగునా మహిళలు మంగళ హారతులిచ్చి, కుంకుమ తిలకాలను దిద్దారు. తమ పర్యటనలో గుర్తించిన, స్థానికులు తీసుకొచ్చిన పలు సమస్యలకు డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి.. అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కాలువలు, రహదారులు అవసరమైన చోట వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శోభార్గవి, జోనల్ ఇన్‌చార్జ్ ఎం. బాలబ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాలన పట్ల ప్రజాస్పందన ఏ విధంగా ఉందో తెలుసుకునేందుకు.. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును పరిశీలించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చక్కటి వేదికగా నిలిచిందన్నారు. నగరంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతత్వంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలూ అందుతున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, డివిజన్ నాయకులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

వంగర: మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అకస్మాత్తుగా పెద్దఎత్తున గాలులు వీయడంతో ఎం.సీతారాంపురం-వంగర గ్రామాల మధ్య ఐదు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. ఎం.సీతారాంపురం పంట పొలాలకు వెళ్లే విద్యుత్ లైన్‌కు మాత్రమే సరఫరా నిలిపివేసి, అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ కె.వినయ్‌కుమార్ తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్